క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

అక్కిరెడ్డిపాలెం: ఏపీఈపీడీసీఎల్ ఆర్‌ఏపీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం తెరిచే ఉంటాయని, విద్యుత్ బిల్లులు చెల్లించుకోవచ్చని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాకలోని ఈఆర్‌ఓ విద్యుత్ చెల్లింపు కేంద్రం, పెదగంట్యాడలోని ఆర్‌ఏపీ చెల్లింపు కేంద్రాలు ఆదివారం అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

744వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్‌ఎండీ విభాగ ఉద్యోగులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 744వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్, ఆర్‌ఎండీ డిపార్టుమెంటు ఉద్యోగులు కూర్చున్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణ కోసం ఎంతటి పోరాటాకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. అందరి సహకారంతో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

ధ్యానంతోనే ప్రపంచ శాంతి



సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మాట్లాడుతున్న రాజు భాయ్

కూర్మన్నపాలెం: ప్రపంచ శాంతి కోసం ధ్యానం చేయాలని మౌంట్ అబుకు చెందిన రాజయోగి రాజుభాయ్.జి అన్నారు. కూర్మన్నపాలెంలోని బ్రహ్మకుమారీ సంస్థను స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహదం చేస్తుందని చెప్పారు. ఇక్కడి కార్యాలయంలో ఉచితంగా ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ భాయ్.జి, శశికళ, రమణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

గాజువాక : నేషనల్ సైన్స్‌డే ను పురస్కరించుకుని స్థానిక ఏవీకే స్కూల్, బీసీ రోడ్డులోని విజ్ఞాన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రతి అంశంలోను పరిశీలన, పరిశోధన, విషయ పరిజ్ఞానం అవసరమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు, శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.బాలజ్యోతి ఏవీకే స్కూల్ కరస్పాండెంట్ పి.మానస త్రినాథ్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.వి.రమణ, కరస్పాండెంట్ టీపీఎల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్నవారు 9494401919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూ యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య భానుకుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 83743 57324లో సంప్రదించాలని సూచించారు.

జంక్షన్ .. నో టెన్షన్

- పాతగాజువాక జంక్షన్ ఆధునీకరణకు శ్రీకారం
- చకచకా సాగుతున్న విస్తరణ పనులు



గాజువాక జంక్షన్‌లో సిగ్నల్ పడడంతో కొత్త గాజువాక రోడ్డులో బారులు తీరిన వాహనాలు (ఫైల్)



పాతగాజువాక జంక్షన్‌లో విస్తరణ పనులు


గాజువాక : పాతగాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు జీవీఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. రూ.54 లక్షల వ్యయంతో ఈ పనులను పూర్తి చేయనున్నారు. జంక్షన్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న రోడ్లను విస్తరించి, ఆధునికీకరించేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారితో పాటు కొత్తగాజువాక మెయిన్ రోడ్, జాతీయ రహదారికి కణితి రోడ్‌ను అనుసంధానించే 60 అడుగుల రోడ్‌లో నిరంతరం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక రోడ్‌లో నుంచి మరో రోడ్‌లోకి వాహనాలు వెళ్తున్న సమయంలో సిగ్నలింగ్ దృష్ట్యా కొద్దిపాటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. దీన్ని పరిష్కరించాలంటే జంక్షన్‌ను విస్తరించడంతో పాటు ఆధునికీకరించడమే మార్గమని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వారి సూచనలకనుగుణంగా జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

గాజువాకలో ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య గందరగోళంగా ఉంటోంది. జాతీయ రహదారిపై నుంచి 60 అడుగుల రోడ్‌కు వెళ్లదలచిన వాహనదారులకు కొత్త గాజువాక నుంచి కూర్మన్నపాలెం, బీహెచ్‌పీవీ వైపు వెళ్లే వాహనాలతో సమస్య ఏర్పడుతోంది. ఈ కారణంగా జంక్షన్ వద్ద ఏ మార్గంలోనైనా కనీసం ఆరేడు నిమిషాలు ఆగిపోవాల్సి వస్తోంది. కొత్త గాజువాక నుంచి వచ్చి పాత గాజువాక వద్ద యు టర్న్ తీసుకుని మళ్లీ గాజువాక వైపు వెళ్లే వాహనాలకు ఇక్కడ టర్న్ తీసుకోవడమే పెద్ద సమస్యగా మారింది. ఆ సమయంలో అక్కడ కొద్దిపాటి గందరగోళం నెలకొంటోంది. ఈ జంక్షన్‌లో నాలుగు సిగ్నళ్లు పని చేస్తుంటాయి. దీని ప్రకారం వాహనాలను నియంత్రించడం పోలీస్ సిబ్బందికి తలనొప్పిగా మారింది. దీంతో పోలీసులు రోడ్డు మధ్య నిలబడి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. ఇలా విధులు నిర్వహిస్తున్న సమయంలో గాజువాక ట్రాఫిక్ సీఐ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకొంటున్నాయి. ఈ పనులు పూర్తయితే ఆ పరిస్థితి మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

విస్తరణ ఇలా..

ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని జంక్షన్ ఆధునీకరణకు శ్రీకారం చుట్టిన జీవీఎంసీ అధికారులు స్పష్టమైన ప్లాన్‌తో పనులను ప్రారంభించారు. ప్రస్తుతం జాతీయ రహదారిపైన, గాజువాక మెయిన్ రోడ్‌కు ఆనుకొని ఉన్న మూడు ఐలాండ్‌లను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా ఐదు ఐలాండ్‌లను నిర్మించనున్నారు. కొత్త గాజువాక నుంచి వచ్చే వాహనాలు యు టర్న్ తీసుకోవడానికి జాతీయ రహదారిపైకి రావాల్సిన అవసరం ఉండదు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ముందు నుంచి యు టర్న్ తీసుకొనే విధంగా రోడ్డును విస్తరిస్తున్నారు. విస్తరణ తరువాత ప్రస్తుతం ఉన్న నాలుగు సిగ్నళ్ల స్థానంలో రెండే ఉంటాయి. జాతీయ రహదారిపై నుంచి 60 అడుగుల రోడ్‌లోకి వాహనాలు వచ్చి పోయే విధంగా రోడ్డును విస్తరిస్తున్నారు. దీనివల్ల జంక్షన్ వద్ద వాహనాలు ఆగే సమయం గణనీయంగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.



పాతగాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణ ప్లాన్

ట్రయల్‌కే ఎక్కువ సమయం

పాత గాజువాక జంక్షన్ విస్తరణ, ఆధునికీకరణలో ట్రయల్ నిర్వహించడానికే కనీసం నెల రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ఐలాండ్‌లను తొలగించి కొత్తగా విస్తరించబోయే మార్గానికి మార్కింగ్ ఇస్తున్నాం. దీని తరువాత ట్రయల్స్ ఉంటాయి. ట్రయల్ పూర్తయిన తరువాత పక్కా నిర్మాణం ఉంటుంది.

– ప్రసాద్‌బాబు,
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ

అర్హులందరూ పెన్షన్‌కు దరఖాస్తు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈపీఎస్–95కు దరఖాస్తు చేసుకోవాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ సూచించారు. నడుపూరులోని నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా పెన్షన్ వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బెల్లాల నాగేశ్వరరావు, మురళీరాజు, సంపూర్ణం, మంత్రి శంకరనారాయణ, సియ్యాద్రి సత్యనారాయణ, బొడ్డు కృష్ణారావు, బొడ్డు వెంకటరావు, కులుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సత్కారం



కొత్తగా నియమితులైన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులుగా ఎన్నికై న వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన కృపాజ్యోతి, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, ఐటీ వింగ్ అధ్యక్షుడు బొండా ఉమామహేష్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలవడంతో, వారిని ఆయన అభినందించారు. అనంతరం సత్కరించారు. రోజారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి శ్రీనివాస్ రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, మీరాబాయి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: గంగవరం పోర్టులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు గొరుసు సత్యారావు కుటుంబానికి 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆర్థిక సహకారం అందించారు. సత్యారావు దశదినకర్మ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్యకు రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గొరుసు సత్యారావు నాయుడు, గురునాథరెడ్డి, చినఅప్పారావు, సత్యం, గొందేశి తోట, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తునున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

పోర్ట్ పెన్షనర్ల ధర్నా రేపు

మత్రిపాలెం: పోర్టు ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావుతో కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మురళీనగర్, తెన్నేటినగర్, మాధవధార, కళింగనగర్ తదితర ప్రాంతాల్లోని పింఛనుదారులను కలిసి కరపత్రాలు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి అన్నపు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

అల్లుకున్న లతలు..అలముకున్న చీకట్లు



దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్లాట్‌ఫాం-1 వైపు విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న లతలు



స్తంభానికి ఉన్న కేబుల్ బాక్స్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వైర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో విద్యుత్ స్తంభాలకు పాదలు దట్టంగా అల్లుకోవడంతో సాయంత్రం ఐదు గంటల తరువాత చీకట్లు కుమ్ముకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పొదలు, ముళ్లపొదలు పెరగడంతో పాటు విద్యుత్ స్తంభాలకు పాదల తీగలు గుబురుగా అల్లుకోవడంతో అంధకారం నెలకొంటోంది. ఈ రహదారిలో చాలా స్తంభాలకు విద్యుత్ దీపాలు వెలగకపోవడం, వెలిగిన చోట పొదలు చాటున దీపాల వెలుగులు ఉండడంతో రహదారి కనిపించడం లేదు. ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ విద్యుత్ విభాగాల అధికారులు స్పందించి పొదలు తొలగించి విద్యుత్‌దీపాలు అమర్చాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

భయపెడుతున్న వైర్లు

విద్యుత్ స్తంభాల వైర్లు జంక్షన్ బాక్సుల వద్ద బాక్సులకు పై మూతలు లేకపోవడంతో కేబుల్స్ బయటికి కనపడుతున్నాయి. కరెంట్ వైర్ల వద్ద కనీస భద్రత చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



అక్కిరెడ్డిపాలెం పంచవటిలో ప్రచారంలో పాల్గొన్న పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి రమాప్రభ

గాజువాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం గాజువాకలో శనివారం జోరుగా సాగింది. తమ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వివిధ రాజకీయ పార్టీల నాయకులు వార్డులలోని గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

- 71వ వార్డు ఆటోనగర్‌లోని గ్రీన్ లైఫ్, సమైక్య, స్వర్ణసాయి అపార్ట్‌మెంట్లలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు రాజాన రామారావు, ఉరుకూటి చందు ఆధ్వర్యంలో ఆయన పట్టభద్రులను కలుసుకొని వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల నాయకులు కోడూరి అప్పలచారారి, మజ్జి శంకరరావు, బూర్ల నారాయణరావు, జయదేవ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించాలి

పెదగంట్యాడ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్‌ను గెలిపించుకోవడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పొలవలస భాస్కరరావు, భీమరెడ్డి శ్రీనివాసరావు, మురళీసుందర్, రాము, రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

- సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 64వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు.
- బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. మండలంలోని నెల్లిముక్కు, సిద్ధేశ్వరం, బాలచెరువు, భానోజీతోట ప్రాంతాల్లో జోరుగా ప్రచారం చేశారు.
- 72వ వార్డు మెహర్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, విజయ, ఆదిలక్ష్మి, నాగమణి, వాసవి నాయుడు, పరిధుల శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, మధు, దీప్తి, భవాని, వరలక్ష్మి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ మద్దతు అభ్యర్థిని గెలిపించండి

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వద్ద గల పంచవటిలో పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ సీపీఎం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సీపీఎం నాయకులు రాంబాబు, ఎ.లోకేష్, సబ్బన్న తదితరులు పాల్గొన్నారు. పీడీఎఫ్ మద్దతు అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ 69వ వార్డు షీలానగర్‌లో గాజువాక జోన్ సీపీఎం నాయకుడు ప్రచారం చేశారు.

బీజేపీ ప్రచారం

గాజువాక : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గాజువాకలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.



72వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

భయం వదిలి, అవగాహన పెంచుకోవాలి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు సతీష్
- టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు సతీష్

గాజువాక : పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వదిలి, అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ నిపుణుడు సతీష్ మాకేనా సూచించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (జీప్సా) ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షలంటే భయం, అవగాహన లోపమే ఓటమికి కారణమవుతుందని అన్నారు. సిలబస్‌లో మార్పు లేకపోవడంతో ప్రణాళికాబద్ధంగా చదివి సులభంగా విజయం సాధించవచ్చన్నారు. పరీక్షల సమయంలో కేవలం శాకాహారమే తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఎలనినో ప్రభావం ఉండొచ్చని, ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. అన్ని పరిస్థితులను బ్యాలెన్స్ చేస్తూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలన్నారు. అనంతరం వివిధ సబ్జెక్టులలో విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు.

జీవితంలో పదో తరగతి కీలక మలుపు

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి తమ జీవితంలోనే కీలక మలుపు అని అన్నారు. అక్కడ్నుంచే భవిష్యత్‌కు బాటలు పడతాయన్నారు. డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీప్సా అధ్యక్షుడు పొలవలస భాస్కరరావు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, రమణ, నారాయణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ధ్వజ స్తంభ స్వర్ణతాపడం పనుల్లో కదలిక

రూ. కోటితో పనులకు సీఎంఆర్ అధినేత సంసిద్ధత



ధ్వజస్తంభం వద్ద పరిశీలిస్తున్న సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం స్వర్ణతాపడం పనుల్లో కదలిక వచ్చింది. కోటి రూపాయల వ్యయంతో ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు నగరంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ శనివారం సింహగిరికి వచ్చి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. ప్రస్తుతం రాగి రేకులతో ఉన్న ధ్వజస్తంభాన్ని స్వర్ణమయం చేసేందుకు (రాగిరేకులపై బంగారుకోటింగ్ వేసేందుకు) గతేడాది సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ సంకల్పించారు. ఈమేరకు రూ.85లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఎస్‌ఎఫ్‌టీకి 2.25గ్రాముల బంగారం వెచ్చించే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. ఆ అంచాలను రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కి అప్పట్లో పంపించారు. మరింత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా స్వర్ణమయం పనులు జరగాలని కమిషనర్ సూచించారు. దీంతో కోటి రూపాయలతో ధ్వజస్తంభం పనులు చేయాలని సీఎంఆర్ అధినేత ముందుకు వచ్చారు. దీంతో శనివారం సీఎంఆర్ ప్రతినిధి చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానం ఏఈ రాంబాబు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులతో కలిసి ధ్వజస్తంభాన్ని పరిశీలించారు. సంబంధిత ఎస్టిమేట్‌ను దేవదాయశాఖ కమిషనర్‌కు పంపించనున్నారు. అక్కడ నుంచి ఆమోదం రాగానే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

వృద్ధి అజెండాలో భారత్ ప్రగతి

ఆరిలోవ : వృద్ధి అజెండాలో భారతదేశం అగ్రగామిగా నిలవడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఈఅండ్‌వై మేనేజింగ్ పార్ట్నర్ జయేష్ సంఘ్వీ తెలిపారు. నగరంలో ఓ హోటల్‌లో శనివారం జరిగిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సీఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ప్రపంచీకరణ, అవకాశాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై మాట్లాడారు. డిజిటలైజేషన్ ఎకో సిస్టంను అందించిందన్నారు. దీంతో పాటు ఫార్మలైజేషన్ గవర్నెన్స్ సమస్యను పరిష్కరిస్తూ కొత్త వ్యాపార ఉత్పత్తుల సేవలను పెంపొందించిందన్నారు. దీనివల్ల సమర్థత, పోటీతత్వం పెరుగుతాయన్నారు. ఇది దేశంలో పెట్టుబడులను పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఉత్పత్తులు తయారీ, మౌలిక సదుపాయాల కల్పనలో భారతదేశం ముందుందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ డెలివరీ హెడ్ నర్రా సురేష్ మాట్లాడుతూ ఐటీ ల్యాండ్ స్కేప్‌లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రాబ్లం సాల్వర్ నుంచి ప్రాబ్లం ఐడింటిఫియర్ వరకు లోపం ఎక్కడ ఉందో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఇది పెద్ద సవాల్‌గా మారిందన్నారు.

సీఐఐ విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లను ఈ సమావేశంలో నియమించారు. సీఐఐ 2023–24 నూతన చైర్మన్‌గా విశాఖ ఫ్యాసిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ పి.పి. లాల్‌ను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఇంటిగ్రిల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్ మేనేజింగ్ పార్టనర్ గ్రంధి రాజేష్‌తో పాటు మరికొందరు సభ్యులను నియమించారు.